జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం | 14 | ఏప్రిల్ | 2025 ◆ పేజీలు : 3

## కన్నులపండువగా రామయ్యకు నిత్యకల్యాణం



**భద్రాచలం, ఏప్రిల్ 13 (ప్రజాజ్యోతి):** భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో ఆదివారం అంతరాలయంలో మూలవరులకు 108 స్వర్ణపుష్పాలతో అర్చన అర్చకులు జరిపారు. అంతరాలయంలోని ధృవ మూర్తులకు ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. ఈ అభిషేకంలో పాల్గొన్న భక్తులు మురిసిపోయారు. అర్చకులు తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యపూజలు భక్తిశ్రద్ధలతో జరిపారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణమూర్తులను ప్రాకార మండపానికి తీసుకువచ్చి శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న జంటలకు ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.



# రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుకుందాం..

- **బిజెపి ఉనికి కోసం మతాల మధ్య చిచ్చు పెడుతుంది**
- **జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ నినాదాన్ని గడప గడపకు తీసుకెళ్లాలి... ఎమ్మెల్యే జారే**

**అశ్వారావుపేట, ఏప్రిల్ 13, ప్రజాజ్యోతి:** దేశంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా మతాల మధ్యన చిచ్చు పెడుతూ ఉనికిని కాపాడుకుంటుందని, ఇటువంటి పరిస్థితుల్లో రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి భారతీయుడిపై ఉందని అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ అన్నారు. రాజ్యాంగ పరిరక్షణ యాత్ర నియోజకవర్గంలో కార్యాచరణ కోసం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మ రాంబాబు

మిగతా 2 లో...



## సింగరేణి లో బయో కెమిస్ట్ , జమేదార్ పోస్ట్ ల భర్తీ లకు అంతర్గత అభ్యర్థులకు వ్రాత పరీక్ష

**కొత్తగూడెం సింగరేణి, ఏప్రిల్ 13, ప్రజాజ్యోతి :** సింగరేణి కాలరీస్ కంపెనీలో ఖాళీగా ఉన్న బయో కెమిస్ట్(ఈ1-గ్రేడ్), జమేదార్(టి&ఎస్ గ్రేడ్ –ఈ) పోస్టులను అంతర్గత అభ్యర్థులతో భర్తీ చేయుటకు ఆదివారము రోజున సింగరేణి మహిళా డిగ్రీ , పీజి కళాశాలలో వ్రాత పరీక్ష నిర్వహించారు. బయో కెమిస్ట్(ఈ1-గ్రేడ్) '1' ఖాళీ కు గాను అర్హులయిన '9' మంది అభ్యర్థులకు హాల్ టికెట్లు జారీ చేయగా, '9' మంది అభ్యర్థులు హాజరయ్యారు. జమేదార్(టి&ఎస్ గ్రేడ్ –ఈ) '26' ఖాళీలకు గాను అర్హులయిన '77' మంది అభ్యర్థులకు హాల్ టికెట్లు జారీ చేయగా, '70' మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ వ్రాత పరీక్ష సెక్యూరిటీ, విజిలెన్స్ సిబ్బంది పర్యవేక్షణలో, సి సి కెమెరాల నిఘా మధ్య నిర్వహించటం జరిగింది. ఈ పరీక్షను జి ఎం (ఈ&ఎం) విజిలెన్స్ కే.ప్రసాదరావు, జి ఎం(పర్సనల్) ఈ ఈ, సి ఎస్ ఆర్ & ఆర్ సి బెనెడిట్ట్ నికోలస్ లు పర్యవేక్షించి, పరీక్ష పూర్తిగా మెరిట్ పై ఆధారపడి ఉంటుందని, దళారులకు ఎలాంటి ప్రమేయం ఉండదని,

మిగతా 2 లో...



# కార్పొరేషన్ ఏర్పాటుతో పాల్వంచ మున్సిపాలిటీ అభివృద్ధికి బాటలు

- **కార్పొరేషన్ ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలి**
- **పేదవర్గాలే సిపిఐకి బలం**
- **పేదలు, కష్ట జీవులు, కార్మికుల పార్టీ సిపిఐ**
- **సిపిఐ శత వసంతోత్సవాలు పార్టీ విస్తరణకు దోహదపడాలి**
- **సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం**
- **పాల్వంచ ప్రాంత సమగ్రాభివృద్ధిపై ఎమ్మెల్యే కూనంనేని ప్రత్యేక శ్రద్ధ**

**కొత్తగూడెం కలెక్టరేట్ , ఏప్రిల్ 13, ప్రజా జ్యోతి :** పాల్వంచ , కొత్తగూడెం, మున్సిపాలిటీలు కలుపుతూ కార్పొరేషన్ ఏర్పాటుతో పాల్వంచ మున్సిపాలిటీ అభివృద్ధికి బాటలు పడ్డాయినీ సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం అన్నారు. ఆదివారం పట్టణ పరిధిలోని సీతా రామపట్నం, గొల్లగూడెం సీపీఐ శాఖ మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత అనేక సంవత్సరాలుగా పాల్వంచ మున్సిపాలిటీకు ఎన్నికలు జరగకపోవడంతో ప్రత్యేక అధికారుల పరిపాలన కొనసాగుతుంది. ఈ నేపథ్యంలోనే స్థానిక శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు

మిగతా 2 లో...

# సామాజిక న్యాయం కోసం జరిగే పోరాటాల్లో కార్మికులు ఐక్యంగా కలిసి నడవాలి

- కార్మికులకు సీఐటీయూ పిలుపు
- సామాజిక వివక్షతకు వ్యతిరేకంగా ఉద్యమాలు ఉధృతం చేయాలి
- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి : ఏ జె. రమేష్





**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 13, ప్రజా జ్యోతి :** సామాజిక విప్లవ కారులు బిటి రణదీవే, విమల రణదివే అంబేద్కర్, జ్యోతిరావు పూలే, సావిత్రి బాయి, ఆశయ సాధనకై సమరశీల పోరాటాలు నిర్వహించి , సామాజిక వివక్షత పై కార్మిక వర్గం ఐక్యంగా ఉద్యమించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే రమేష్ పిలుపునిచ్చారు. పాల్వంచలోని స్థానిక సిఐటియు కార్యాలయంలో జరిగిన ఆల్ హమాలి యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో ఆదివారం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏజే రమేష్ మాట్లాడుతూ పని ప్రాంతాల్లో కార్మిక వర్గం అనేక రకాల వివక్షతకు గురవుతుందని వస్తున్న వేతనాలు ప్రభుత్వం సంక్షేమ పథకాల విషయంలో కుల సామాజిక అణిచివేత అధికమవుతున్న నేటి వ్యవస్థలో కార్మిక వర్గం కార్మిక వర్గ వ్యతిరేక విధానాలపై ఐక్యంగా ఉద్యమించాలని, సామాజిక న్యాయం కోసం నడుం బిగించాలని కేజీ రమేష్ పిలుపునిచ్చారు. రోజురోజుకీ ధరలు పెరుగుతున్న నేపథ్యంలో కూలి రేట్లు పెరగడం లేదని, ప్రభుత్వం కనీస వేతనం అమలు చేయడం లేదని, పని ప్రాంతాల్లో ఎస్సీ ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గానికి చెందినవారు అధికంగా కార్మికులు ఉన్నారని వీరి పట్ల వివక్షత చూపెడుతున్న ప్రభుత్వం ఆర్థికంగా బలపడడానికి కృషి చేసే విషయంలో వివక్షత ఉందని, వేతనాలు అమలు చేసే విషయంలో వెనుకబాటు ఉందని, మహిళలు పురుషులు అని వివరించి ఇచ్చే కూలి రేట్లలో కూడా తేడా చూపిస్తున్నారని , ఇటువంటి సామాజిక వివక్షత పట్ల కార్మికుల ఐక్యంగా ఉద్యమించాలని ఆయన అన్నారు . దేశ వ్యాప్తంగా సామాజిక న్యాయ క్యాంపెన్లో కార్మికులు ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కార్మిక వర్గ పోరాటాలకు సామాజిక ఉద్యమాలను మిళితం చేసి ముందుకు సాగాలని కోరారు. అంబేద్కర్ కలలుగన్న సమాజం కోసం, ఆయన ఆశయ సాధన కోసం, కుల నిర్మూలన కోసం, ప్రతి కార్మికుడు ప్రజలు అంబేద్కర్ చూపిన బాటలో నడవాలని ఆర్థిక సామాజిక పోరాటాలు నిర్వహించాలని అప్పుడే అందరూ సమానంగా ఉండే సమాజం ఏర్పడుతుందని ఏజె రమేష్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డ రవికుమార్ , పట్టణ కన్వీనర్ కే సత్య. హమాలి యూనియన్ నాయకులు గట్టయ్య, రాములు రాజు నాగేశ్వరావు , నరేష్ ,నాగుల మీరా, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## వనజీవి రామయ్య జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

- వనజీవి ఆశయాలను కొనసాగించాలి
- వనజీవి రామయ్య పార్థివ దేహాన్ని సందర్శించిన రజాక్




**కొత్తగూడెం, ఏప్రిల్ 13, ప్రజాజ్యోతి :** హరిత ప్రేమికుడు, పర్యావరణ పరిరక్షకుడు పద్మశ్రీ వనజీవి రామయ్య పార్ధివ దేహానికి ఆదివారం ఖమ్మం లోని ఏదులాపురం మున్సిపాలిటీలో ఐఎన్టియుసి కేజీఎం ఏరియా వైస్ ప్రెసిడెంట్ రజాక్ రెడ్డిపల్లిలో నివాళులు అర్పించి, సంతాపం తెలిపారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వనజీవి రామయ్య జీవితం స్ఫూర్తిదాయకమని, ఆయన స్ఫూర్తితో వనజీవి ఆశయాలను నెరవేర్చే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమం లో చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్ కె. గౌస్, అన్నం శ్రీనివాసరావు, మల్లికఖార్జున్, మధు, షాంశీర్, కె ఎన్. రాజశేఖర్, మస్తాన్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మ జన్మనిస్తే రక్తదానం పునర్జన్మని ప్రసాదిస్తుంది

- డాక్టర్ మహమూద్ పాషా



**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 13, ప్రజా జ్యోతి :**మదర్ తెరిసా చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు చైర్మన్ కొప్పుల మురళి జన్మదినోత్సవం సందర్భంగా భద్రాచలం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలోని బ్లడ్ బ్యాంక్ నందు మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గర్భిణీ మహిళలు, తల సేమియా, సికిల్ సెల్ ఎనీమియా వ్యాధితో బాధపడుతున్న వారి కోసం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ రక్తదాన శిబిరాన్ని ఉద్దేశించి డాక్టర్ మహమ్మద్ పాషా మాట్లాడుతూ ఈ రోజుల్లో యువత పుట్టినరోజు అంటే కేక్ కటింగ్ లు పార్టీలు జరుపుకునే రోజులలో ట్రస్ట్ చైర్మన్ కొప్పుల మురళి జన్మదిన సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసిన మధర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులను అభినందించారు. ఆరోగ్యంగా ఉన్నవారు మూడు నెలలకోసారి రక్తదానం చేయడం వల్ల సదరు వ్యక్తి ఆరోగ్యంగా ఉండడంతోపాటు ప్రమాదకర పరిస్థితుల్లో మరొకరికి ప్రాణదానం చేసినవారవుతారు అని అన్నారు. ట్రస్టు వ్యవస్థాపకులు కొప్పుల మురళి మాట్లాడుతూ తల సేమియా వ్యాధితో బాధ పడుతున్న పిల్లలు 21 రోజులకు ఒకసారి రక్తం ఎక్కించుకోవాల్సిన పరిస్థితి ఉందని అన్నారు. అలాగే ప్రతి రోజూ గర్భిణీ మహిళలకు సకాలంలో రక్తం సరియైన సమయంలో దొరకక చాలా ఇబ్బంది పడుతున్నారని, అత్యవసర చికిత్సలు, క్లిష్టమైన ప్రసవాల సమయంలో రక్తం ఎంతో అవసరమవుతుంది. దేశంలో ప్రతి రెండు సెకండ్లకు ఒకరికి రక్తం అవసరమవుతుందని తెలిపారు. సరైన అవగాహన లేనందున రక్తదానం చేసేవారి సంఖ్య పూర్తిగా తగ్గిపోతుందని అన్నారు. రక్తదాతలు ముందుకొస్తే ఎన్నో ప్రాణాలను కాపడవచ్చు అని అన్నారు. రక్త నిలువలు పెంచేందుకు స్వచ్ఛందంగా యువత, విద్యార్థులు ముందుకు రావాలని కోరారు. రక్తదానం చేయడం వలన మనిషి శరీరంలో రక్త ప్రసరణ సక్రమంగా ఉండటంతో పాటు గుండె సంబంధిత వ్యాధుల నుండి కూడా కాపాడటంతో పాటు మనిషి ఆయుషుని పెంచుతుందని అన్నారు. అడగగానే స్పందించి అధిక సంఖ్యలో స్వచ్ఛందంగా రక్తదానం చేసిన ప్రతీ ఒక్కరికీ మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ తరుపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ రక్తదాన శిబిరంలో 20 మంది రక్తదానం చేశారని ట్రస్ట్ చైర్మన్ కొప్పుల మురళి తెలియజేశారు.అనంతరం రక్తదాతలకు డౌన్లోడ్ సర్టిఫికెట్స్, పండ్లు , ఫ్రూటీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు నిర్వాహకులు జయరాం, ఎడ్విన్ కిషోర్, బురం.నవీన్, శ్రీకాంత్, పడిదెల వంశీ, ఆనంద్, అజిత్, ఉమామహేశ్వరరావు, లోకేష్, మధుసూదన్ రావు, టి నవీన్, సారయ్య, రాజు, చంటి, భాను ప్రకాష్, పవన్ కళ్యాణ్, సాయి వీరేష్, విజయ్ ఏరియా వైద్యశాల బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్స్ చందు, శ్రీను నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి లో బయో కెమిస్ట్ , జమేదార్ పోస్ట్ ల భర్తీ లకు అంతర్గత అభ్యర్థులకు వ్రాత పరీక్ష

(మొదటి పేజీ తరువాయి... )



వారిని నమ్మి ఎవరూ మోసపోవద్దని సూచించారు. ఈ పరీక్ష ఫలితాలు ఆదివారం రాత్రి నుంచే సింగరేణి వెబ్ సైట్ , సింగరేణి ప్రధాన కార్యాలయ ముఖద్వారం వద్ద నోటీస్ బోర్డు ద్వారా తెలియజేయటం జరుగుతుంది అని తెలియజేశారు. ఈ పరీక్ష నిర్వహణ పరీశీలనలో డి జి ఎం(పర్సనల్) పి.వేణు గోపాల రావు, ఎస్ ఓ టు జి ఎం(సెక్యూరిటీ) జే.వేణు మాధవ్, పర్సనల్ మేనేజర్ కే..ప్రకాశ రావు, డి వై.పి ఎం డి.నాగేశ్వర రావు, విజిలెన్స్ ఆఫీసర్ జి.రాంచందర్, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చింతా శారద, ఇతర అధికారులు, సెక్యూరిటీ సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుకుందాం..

(మొదటి పేజీ తరువాయి... )

అధ్యక్షతన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక శాసనసభ్యులు జారే ఆదినారాయణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారే మాట్లాడుతూ జై బాపు, జై భీమ్, జై సం విధాన్ అభియాన్ నినాదాన్ని ప్రతి గడపకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని అందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఆర్ఎస్ఎస్ ఎజెండాను రహస్యంగా అమలు చేయటమే లక్ష్యంగా మోడీ ప్రభుత్వం ప్రజల మధ్యన మతం పేరుతో చిచ్చు పెడుతుందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఆదర్శలను ఆలోచనలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని అందుకు ప్రతి ఒక్కరు సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నియోజకవర్గ ఇన్చార్జ డాక్టర్ రవి, సుంకవల్లి వీరభద్రరావు, కానూరి మోహన్ రావు, జూపల్లి ప్రమోద్, మిండా హరికృష్ణ, కొల్లు చంద్రశేఖర్ ,రామలక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేషన్ ఏర్పాటుతో పాల్వంచ మున్సిపాలిటీ అభివృద్ధికి బాటలు

(మొదటి పేజీ తరువాయి... )

పట్టు పట్టి కార్పొరేషన్ ఏర్పాటు చేయించారని, రానున్న కార్పొరేషన్ ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలినీ కోరారు. పేద ప్రజలు, కష్టజీవులు, కర్షకులు, కార్మికుల పార్టీ సిపిఐ అని, సుదీర్ఘ పోరాటాలు, త్యాగాలతో నిర్మితమైన ఎర్ర జెండా పార్టీకి ఎదురులేదని, నిరంతరం సమరశీల పోరాటాలు సాగిస్తున్న సిపిఐ ఒక ప్రాంతానికో, ఒక వర్గానికో పరిమితమైన పార్టీ కాదని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిస్కారంకోసం, పార్టీ పటిష్ఠతకోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని తెలిపారు. వందేళ్లగా పేద ప్రజల పక్షాన పోరాటాలు చేస్తూ సీపీఐ శతవసంతాలు వేడుకలు సందర్భంగా ఈ ఉత్సవాలను ప్రతి వార్డులో ఘనంగా నిర్వహించాలని, తద్వారా పట్టణంలో మరింత పార్టీ విస్తరణకు శతవసంతాల ఉత్సవాలు దోహదపడాలని పిలుపునిచ్చారు. స్థానిక శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు నియోజకవర్గని అన్ని విధాల అభివృద్ధి చేయటానికి కృషి చేస్తున్నారని తెలిపారు. అనంతరం సీతారామపట్నం సిపిఐ నూతన శాఖ కార్యదర్శిగా తంతనపల్లి వెంకన్న, సహాయ కార్యదర్శిగా లక్ష్మీనారాయణ తో పాటు 15 మందితో, గొల్లగూడెం సిపిఐ నూతన శాఖ కార్యదర్శిగా ఎల్లబోయిన రామకృష్ణ, సహాయ కార్యదర్శిగా చింతల రామకృష్ణ, బండారి భాస్కర్ 19 మందితో నూతన శాఖ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు బండి నాగేశ్వరరావు, పట్టణ సహాయ కార్యదర్శి ఉప్పుశెట్టి రాహుల్, ఏఐటీయూసీ నాయకులు అన్నారపు వెంకటేశ్వర్లు, మడుపు ఉపేంద్ర చారి, వైఎస్ గిరి, వర్క్ అజిత్, ఎల్లబోయిన నరసయ్య, లింగం సత్య నారాయణ, అల్లి పున్నయ్య, బిల్లా రంగయ్య, జయమ్మ, నాగమణి, కృష్ణవేణి, భవాని, దానయ్య, లక్ష్మీనారాయణ, రామ్మోహన్, రాంబాబు, వినోద్, దుర్గాప్రసాద్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ముక్తార్ పాషా స్థూపావిష్కరణను జయప్రదం చేయండి

- సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ కేంద్ర కమిటీ నాయకులు




**టేకులపల్లి, ఏప్రిల్ 13, ప్రజాజ్యోతి :** ఐఎఫ్టియు జాతీయ ప్రధాన కార్యదర్శి అమరుడు ఎస్కే ముక్తార్ పాషా స్థూపావిష్కరణ బహిరంగ సభలను జయప్రదం చేయాలని కోరుతూ ఆది వారం టేకులపల్లి మండల కేంద్రంలో పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది ఈ సందర్భంగా ఐఎఫ్ టియు రాష్ట్ర నాయకులు డి.ప్రసాద్ సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ టేకులపల్లి మండల కార్యదర్శి కల్తీ వెంకటేశ్వర్లు, ఏఐ కేఎంఎస్ జిల్లా నాయకులు భూక్య హర్జ మాట్లాడుతూ కామ్రేడ్ ముక్తర్ పాషా మారుమూల ఏజెన్సీ మండలమైన గుండాలలో 1962లో పోలీస్ పటేల్ ఇంటిలో జన్మించారని మధ్యతరగతి కుటుంబం అయి నప్పటికీ తను చదువుతున్న సమయంలో విప్లవ రాజకీయాలకు ఆకర్షితులై విప్లవ విద్యార్థి సంఘం పిడిఎస్ యు లో చేరారని అన్నారు. అంచలంచెలుగాఎదుగుతూ సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ నాయకులుగా ఐ ఎఫ్టియు జాతీయ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తూ కరోనాతో మర ణించారని ఆయన మరణం కార్మిక వర్గానికి తీవ్ర లోటు అని అన్నారు . ముక్తార్ పాషా ఆశయాలను కొనసాగిస్తూ, ఆయన కన్న కలలను నిజం చేస్తూ స్మార్కార్థం నిర్మించిన స్థూపం ఆవిష్కరణ , బహిరంగ సభ ఈనెల 15వ తారీఖున ఉంటుందని తెలిపారు. ఈ స్థూపావిష్కరణ బహిరంగ సభకు ప్రజలు కార్మిక వర్గం అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలు పునిచ్చారు. ఈ కార్యక్రమంలో భూక్య నర్సింగ్ ఎట్టి నరసింహారావు, గూగుల్ రామచంద్, బోడామంచ, నోముల భానుచందర్, తోటకూరి సతీష్, బాలు, పాల్య శ్రీను, భూక్య రామకోటి, చంద్యా పాల్గొన్నారు

# కోరం పుల్లయ్య ప్రథమ వర్ధంతి సభలో ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి

- భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం, ముఖ్య నాయకులు



**టేకులపల్లి, ఏప్రిల్ 13, ప్రజాజ్యోతి :** టేకులపల్లి మండలం, కోయగూడెం గ్రామం ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య స్వగృహంలో తన తండ్రి కోరం పుల్లయ్య సంవత్సరికం(ప్రథమ వర్ధంతి) ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని కోరం పుల్లయ్య చిత్ర పటానికి పూలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కోరం కనకయ్య, కోరం సురేందర్ ల కుటుంబాలను పరామర్శించారు. కోరం పుల్లయ్య చిత్ర పటానికి నివాళి అర్పించిన వారిలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, రాంరెడ్డి గోపాల్రెడ్డి, మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి, తుళ్లూరి బ్రహ్మయ్య, కొప్పుల చంద్రశేఖర్, కానుగుల చంద్రశేఖర్, దమ్మాలపాటి వెంకటేశ్వర్లు, బానోత్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# నేడు గిరిజన దర్బార్ రద్దు



**భద్రాచలం, ఏప్రిల్ 13(ప్రజాజ్యోతి ) :** భద్రాచలం ఐటీడీఏ సమావేశ మందిరంలో ప్రతి సోమవారం జరిగే గిరిజన దర్బార్ సోమవారం రద్దు చేస్తున్నట్లు ఐటీడీఏ పీవో రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం అంబేద్కర్ జయంతి సందర్భంగా ప్రభుత్వ సెలవు కావడంతో గిరిజన దర్బార్ రద్దు చేయడం జరుగుతుందని, యూనిట్ అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండని కారణంగా ఆదివాసీ గిరిజన ప్రజలు ఈ విషయాన్ని గమనించి కార్యాలయానికి రావద్దని సూచించారు.

# సర్వమత సమ్మేళనంతో ఈద్ మిలాప్ కార్యక్రమం



**భద్రాచలం, ఏప్రిల్ 13(ప్రజాజ్యోతి ):** భద్రాచలం పట్టణంలో జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో ఆదివారం సర్వమత సమ్మేళనంతో ఈద్ మిలాప్ కార్యక్రమం నిర్వహించారు. అన్నిమతాల నాయకులతో కనులవిందుగా ఈ కార్యక్రమం సాగింది. సమస్త సృష్టిని సృష్టించిన సృష్టికర్త మనందరికీ ఒక్కడై ఉన్నాడని, మనమందరం ఒకే తల్లిదండ్రి సంతానమని కొనియాడుతూ జమాతే ఇస్లామి హింద్ బాధ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జమాతే ఇస్లామి హింద్ జిల్లా నాయకులు ఫారుక్, అబ్దుల్ బాసిత్, పట్టణ అధ్యక్షులు అబ్దుల్ మునాఫ్, పురోహితులు రామాచారి, ఫాస్టర్ ప్రవీణ్, ఎంఆర్పీఎస్ అధ్యక్షులు రాజా, దళిత సంక్షేమ అధ్యక్షులు పిచ్చయ్య, లయన్స్ క్లబ్ బాధ్యులు రామలింగేశ్వరరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కోట దేవదానం, చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు యశోద రాంబాబు, పెయింట్ అధ్యక్షులు జాకీర్, ఐద్వా జిల్లా అధ్యక్షులు లక్ష్మి , ఎంఆర్పీఎస్ జిల్లా మాజీ అధ్యక్షులు లత, జమాతే ఇస్లామి హింద్ జిల్లా మహిళా నాయకురాలు పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షకుడు వనజీవి రామయ్య

- రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల



**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 13, ప్రజా జ్యోతి :** పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా సుమారు కోటి మొక్కలు నాటిన వనజీవి రామయ్య ధన్యజీవి అని రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పర్యావరణంను కాపాడేందుకు సుమారు కోటి మొక్కలు నాటి పద్మశ్రీ అవార్డు పొందిన దరిపల్లి రామయ్య ఆకస్మిక మృతి పట్ల కొత్వాల సంతాపం తెలిపారు. మెడలో వృక్షో రక్షితి రక్షితః అనే ఆకుపచ్చ బోర్డు కట్టుకొని ప్రకృతి పరిరక్షణకై విశేష ప్రచారం గావించిన రామయ్య మృతి ప్రకృతి ప్రేమికులకు,ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలకు తీరని లోటు అన్నారు. వనజీవి రామయ్య ఆశయాలను నేటితరం స్ఫూర్తిగా తీసుకోవాలని కొత్వాల అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# విద్యుత్ షార్ట్ సర్క్యూట్తో వరిగడ్డి దగ్ధం




**టేకులపల్లి,ఏప్రిల్ 13, ప్రజాజ్యోతి:** ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో మండలంలోని కొత్త తండా గ్రామంలో పశువుల కొరకు నిల్వ ఉంచిన వరిగడ్డి కాలిన సంఘటన కొత్త తండా గ్రామంలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం టేకులపల్లి మండలం కొత్త తండా జి గ్రామానికి చెందిన బానోత్ కిషన్ అనే రైతు ఇంటికి సమీపాన ఉన్న వరిగడ్డి వాము విద్యుత్ షార్ట్ సర్క్యూట్తో మంటలు అంటుకున్నాయి. స్థానికులు కొత్తగూడెం నుంచి వచ్చిన ఫైర్ ఇంజన్ సిబ్బంది మండల ఆర్పారు. సుమారు పదివేల రూపాయల విలువ కలిగిన వరిగడ్డి కాలిందని తెలిపారు.

# రెండు దశాబ్దాల అపూర్వ కలయిక




**భద్రాచలం, ఏప్రిల్ 13(ప్రజాజ్యోతి ) :** భద్రాచలం కొర్రాజులగుట్ట పాఠశాలలో 2004-2005లో పదవతరగతి చదివిన విద్యార్థులు రెండు దశాబ్దాల తర్వాత అపూర్వంగా కలవడంతో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. నాడు పాఠశాలలో తోటి విద్యార్థులతో కలిసి చదువుకున్న గత స్మృతులను నెమరువేసుకుంటూ తీపి జ్ఞాపకాలను ఒకరినొకరు పంచుకున్నారు. 20 ఏళ్ల తర్వాత చిన్ననాటి మిత్రులను కలుసుకోవడంతో ఎంతో ఉద్వేగానికి లోనయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటల్లో మునిగితేలారు. నాడు తమకు పాఠాలు బోధించిన గురువులతో అనుబంధాన్ని పంచుకున్నారు. అనంతరం వారంతా సహపంక్తి భోజనాలు చేసి ఆ జ్ఞాపకాలతో వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో నాటి గురువులు, పూర్వవిద్యార్థులు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.